# గుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు



లక్ష్మీనారసింహుల నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పూజలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో లక్ష్మీనారసింహుల నిత్యోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన, బాలబోగం నిర్వహించారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణోత్సవం జరిపించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నారసింహుడిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను గరుఢ, తిరుచ్చీ వాహనాలపై వేంచేపు చేసి ఆలయ మాఢవీధుల్లో సేవ ఊరేగించారు. అనంతరం తిరువారాధన, తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో ప్రధానాలయం, అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల కోలాహలం నెలకొంది. తెల్లవారుజాము నుంచి శివాలయంలో శివుడికి దీపారాధన, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. రామలింగేశ్వర కుటుంబంతో పాటు ఆలయంలో స్పటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నర పాటు జరిపారు. సాయంత్రం రామలింగేశ్వరుడికి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. పాతగుట్ట ఆలయంలో కార్తీకమాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.31,98,254 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

### స్వామిని దర్శించుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే

యాదగిరీశుడిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. కార్తీక మాసం కావడంతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### 7న హుండీల లెక్కింపు

గుట్ట లక్ష్మీనరసింహ స్వామి హుండీలను ఈ నెల 7న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు. ఉదయం 7గంటలకు కొండకింద వ్రత మండపంలో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.




కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

# చెర్వుగట్టుపై కార్తీక శోభ

నార్కట్‌పల్లి, డిసెంబర్ 4 : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామిని భక్తులు సోమవారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులతో చెర్వుగట్టు క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. వేకువజామునే భక్తులు కొనేరులో పుణ్య స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. కొంత మంది భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఈఓ నవీన్ మౌళిక వసతులు కల్పించారు.



స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

# కాంగ్రెస్‌లో పోరు షురూ

- సీఎం కుర్చీ వివాదంలో కీలకంగా ఉన్న జిల్లా సీనియర్ నేతలు
- రేవంత్‌కు వ్యతిరేకంగా ఉత్తమ్ లాబీయింగ్
- ఇప్పటి వరకు ఉత్తమ్ వర్గానిదే పైచేయి
- చెరో దారిలో కోమటిరెడ్డి బ్రదర్స్
- ఉత్తమ్, వెంకట్‌రెడ్డి మధ్య అమాత్య పోరు
- రసవత్తరంగా జిల్లా కాంగ్రెస్ రాజకీయం

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెడితే వీళ్లల్లో వీళ్లే కొట్టుకోవడమే సరిపోతుంది. ఇక రాష్ట్రాన్ని ఏం పాలిస్తారని వెల్లువెత్తిన సందేహాలు ఒక్కరోజు తిరగకముందే కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన క్లియర్ మెజార్టీని రాష్ట్ర ప్రజలు కట్టబెట్టినా ముఖ్యమంత్రి ఎవరనేది వివాదస్పదంగా మారింది. పీసీపీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మధ్య సీఎం రేస్ కొనసాగుతున్నది. ఇందులోనూ రేవంత్‌రెడ్డి ఒక వైపు, మిగతా ఇద్దరూ మరోవైపు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రేవంత్‌రెడ్డిని సీఎం గాకుండా అడ్డుకోవడమే లక్ష్యం అన్నట్లుగా ఉత్తమ్, భట్టి జతకట్టారు. రేవంత్‌రెడ్డికి, జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎన్నికలకు ముందు నుంచే పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. ఎన్నికల తర్వాత అది మరింత తారాస్థాయికి చేరింది. రేవంత్‌రెడ్డి పథకం ప్రకారం తానే సీఎంనన్న ప్రచారాన్ని విస్తృతం చేసుకున్నారు. ఆదివారం ఫలితాలు వెలువడిన వెంటనే మిగతా ముఖ్య నేతలంతా ఆయా కౌంటింగ్ కేంద్రాల నుంచి బయటకు రాక ముందే రేవంత్‌రెడ్డి సీఎల్పీ నేత ఎంపిక భేటీకి పావులు కదపడం ఉత్తమ్, భట్టి లాంటి వాళ్లంతా జీర్ణించుకోలేక పోయారు. ఇతర సీనియర్లు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజగోపాల్‌రెడ్డి, పొంగులేటితో కలిసి ఉత్తమ్, భట్టిలు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా జట్టు కట్టారు.

### భట్టి, ఉత్తమ్ జతగా పావులు

రేవంత్‌రెడ్డి తీరుతో రాత్రికి రాత్రే అలర్టయిన ఉత్తమ్, భట్టి సీఎల్పీ నేత ఎన్నికను సోమవారానికి వాయిదా వేయించారు. మధ్యాహ్నం ఎల్లా హోటల్‌లో జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో సీఎల్పీ నేత ఎంపిక వ్యవహారాన్ని అధిష్ఠానానికి వదిలేసినట్లు ఏకవాఖ్య తీర్మానం చేసి ఢిల్లీకి పంపారు. దీని తర్వాతే సోమవారం సాయంత్రం సీఎల్పీ నేత ఎన్నిక, రాత్రికి సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందని ప్రచారం జరిగింది. కానీ అనంతరం ప్రతిష్టంభన కొనసాగింది. రేవంత్‌రెడ్డికి సీఎం అయ్యే అర్హత లేదంటూ ఉత్తమ్, భట్టి విక్రమార్క అధిష్టానం వద్ద బలంగా వాదించినట్లు తెలిసింది. గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా మాత్రమే పనిచేసిన రేవంత్‌రెడ్డికి మంత్రి పదవుల లాంటి పాలనాపరమైన బాధ్యతలు నిర్వహించిన అనుభవం సైతం లేనందున నేరుగా సీఎం పదవి కట్టబెడితే పార్టీకి ఇబ్బందులు తప్పవన్న చర్చ లేవనెత్తినట్లు తెలిసింది. ఇదే క్రమంలో రేవంత్‌రెడ్డికి మరకలా ఉన్న నోటుకు నోటు కేసును ప్రస్తావించడంతో పాటు 'వ్యవసాయానికి 3గంటల కరెంటు చాలు... 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకుంటే సరిపోతది'... లాంటి తొందరపాటు వ్యాఖ్యలు ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం చేశాయని గుర్తు చేసినట్లు సమాచారం. వీటన్నింటి నేపథ్యంలో రేవంత్‌రెడ్డికి గాకుండా వేరెవరికైనా సీఎం పదవి ఇవ్వాలని ఉత్తమ్, భట్టి వర్గం పట్టుబట్టింది. దీంతో సోమవారం జరగాల్సిన ఎన్నిక, సీఎం ప్రమాణ స్వీకారం వాయిదా పడింది. ఈ మొత్తం పరిణామాల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక భూమిక పోషిస్తుండడం గమనార్హం.

### చెరో దారిలో కోమటిరెడ్డి బ్రదర్స్

సీఎం కుర్చీ చుట్టూ నెలకొన్న ప్రతిష్టంభనలో కోమటిరెడ్డి బ్రదర్స్ చెరోవైపు నిలవడం ఆసక్తికరంగా మారింది. సీఎం కుర్చీ విషయంలో నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఆదివారం నల్లగొండ కౌంటింగ్ కేంద్రంలోనే సీఎం పదవిపై వెంకట్‌రెడ్డి మీడియాతో స్పందిస్తూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కోసం బాగా కష్టపడ్డారు అంటూ కితాబివ్వడంతోనే ఆయన వైఖరి స్పష్టమైంది. నల్లగొండ నుంచి నేరుగా రేవంత్‌రెడ్డి వద్దకే వెంకట్‌రెడ్డి వెళ్లడం విశేషం. ఇదే సమయంలో మునుగోడు నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాత్రం తన అన్న వెంకట్‌రెడ్డితో విభేదించారు. రేవంత్‌రెడ్డి వ్యతిరేకవర్గం ఉత్తమ్, భట్టి విక్రమార్కలతో చేతులు కలిపారు. సోమవారం అంతా ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు తదితర సీనియర్ నేతలతో కలిసి రాజగోపాల్‌రెడ్డి... రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పావులు కదపడంలో సక్సెస్ అయ్యారు. అయితే రేవంత్‌రెడ్డి క్యాబినేట్‌లో మంత్రి పదవి కోసం వెంకట్‌రెడ్డి ప్రయత్నిస్తుండగా భట్టి లేదా ఉత్తమ్ సారథ్యంలో తాను జిల్లాలో కీలకంగా ఉండాలని రాజగోపాల్‌రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అన్నదమ్ములిద్దరూ చెరోవైపు అడుగులు వేస్తుండడం జిల్లా రాజకీయాలను రక్తి కట్టిస్తుంది. ఇదంతా ఇలా ఉంటే జిల్లా నుంచి తొలిసారిగా గెలుపొందిన ఐదుగురు ఎమ్మెల్యేలతో పాటు రెండోసారి గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ పరిణామాల్లో ఎటువైపు ఉంటారన్న దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

### రెండా... ఒకటా...

ఇక ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవులు ఎన్ని దక్కవచ్చన్నది ఆసక్తికరంగా మారింది. రేవంత్‌రెడ్డి సీఎం అయితే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అమాత్య యోగం ఖాయంగానే కనిపిస్తోంది. కాగా సీఎం రేస్‌లో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రేవంత్‌రెడ్డి క్యాబినేట్‌లో ఉంటాడా అన్నది కూడా సందేహాస్పదంగా మారింది. రేవంత్ టీంలో ఉండడం ఇష్టం లేకుంటే తన సతీమణి పద్మావతిని ఆ స్థానంలో కూర్చోబెడతారన్న చర్చ లేకపోలేదు. అదే మల్లు భట్టి విక్రమార్క సీఎం అయితే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమే. ఇదే సమయంలో రెండో మంత్రిగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సైతం అవకాశం లేకపోలేదన్న చర్చ ఉంది. మొత్తంగా జరుగుతున్న పరిణామాలన్నీ జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.




నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్

# ఆగిన చదువులకు ఆహ్వానం

- ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న ఓపెన్ స్కూళ్లు
- టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్‌కు 11 వరకు గడువు పెంపు

రామగిరి, డిసెంబర్ 4 : మధ్యలో చదువు ఆపేసిన, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం చేసేవారికి ఓపెన్ స్కూళ్లు వరంలా మారాయి. 2023-24 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్మీడియట్ చదువాలనుకునే వారికి ఉమ్మడి జిలావ్యాప్తంగా 113 ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలు(స్టడీ సెంటర్లు) అందుబాటు ఉన్నాయి. వీటిలో ఆయా కోర్సుల్లో చేరడానికి ఇప్పటికే గడువు ముగియగా రాష్ట్ర విద్యాశాఖ ఈ నెల 11వరకు ప్రత్యేక గడువుతో మరో అవకాశం కల్పించారు. వీటిలో అడ్మిషన్లు తీసుకున్న అభ్యర్థులకు ప్రత్యక్షంగా, వాట్సాప్, ఆన్‌లైన్ విధానంలో తరగతుల నిర్వహణ సాగడం విశేషం. అభ్యర్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు సైతం అందిస్తారు. అందుకే చదువుకొనసాగించాలనే వారు ఓపెన్ స్కూళ్లు వరంగా చెప్పవచ్చు. గత సంవత్సరం చూస్తే ఈ పర్యాయం అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు**

| జిల్లా | టెన్త్ | ఇంటర్ | మొత్తం |
|---|---|---|---|
| నల్లగొండ | 32 | 28 | 60 |
| సూర్యాపేట | 17 | 21 | 38 |
| యాదాద్రి | 11 | 07 | 18 |
| మొత్తం | 60 | 56 | 113 |

### సద్వినియోగం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లాకు ఓపెన్ స్కూల్ కోఆర్డినేషన్ సెంటర్ నల్లగొండ డీఈఓ కార్యాలయంలో ఉంది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఇంకా అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు 8008403523 నంబర్‌ను సంప్రదించాలి.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ